


ఆల్ఫుర్‌ఖాన్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- మసీదుల్లో, ఈద్గాల్లో ప్రార్థనలు
- సమస్త మానవాళి కోసం ముస్లింల దువా
- పోలీసుల ప్రత్యేక బందోబస్తు

నంద్యాల కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజద్‌బాషా సిద్ధిఖీ అన్నారు. శనివారం నంద్యాలలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాలలోని అన్ని ఈద్గాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9.30గంటల వరకు ఆయా మసీదుల్లో ఇమాముల ఆధ్వర్యంలో ఈద్ ప్రార్థనలు జరిపించారు. సాయి బాబా నగర్ ఈద్గాలో ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజద్ బాషా సిద్ధిఖీ, బీమవరం ఆల్‌పుర్‌ఖాన్ ఈద్గాలో మౌలానా అబ్దుల్ హాది సాహెబ్, మూలసాగరం ఈద్గాలో మౌలానా మహబుబ్‌బాషా సాహెబ్, ఎస్ఆర్‌బీసీ ఈద్గాలో ముఫ్తి రఫి సాహెబ్ ప్రార్థనలు చేశారు. ఇమామ్‌లు, ముస్లింలు నమాజ్ ఆచరించి సమస్త మానవాళి కోసం దువా చేశారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



ఆల్‌పుర్‌ఖాన్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న మౌలానా అబ్దుల్ హాది సాహెబ్



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



సాయిబాబానగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

డ్రోన్లతో నిరంతర నిఘా

- నేరస్థులు సత్ప్రవర్తనతో ఉండాలి
- రాయలసీమ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

డోన్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిరంతర నిఘా ఉంచాలని రాయలసీమ రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్ అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ముఖ్యఅ తిథులకు డీఎస్పీ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డ్రోన్ పని తీరును డీఐజీ ప్రవీణ్ ఆపరేట్‌చేసి డెమో ద్వారా పోలీసులకు వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో పోలీసు సిబ్బంది కొరత ఉందన్నారు. 2018 తర్వాత పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ జర గలేదన్నారు. ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ ఆవరణంలో డ్రోన్‌ను అతిథులు ప్రారంభించి ఎగురవేశారు. అక్కడే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ డిజిటల్ సైన్ బోర్డ్సును ప్రారంభించి డీఎస్పీ శ్రీనివాసులు డెమో ద్వారా ప్రదర్శించి ఉన్నతాధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ మోహన్‌రెడ్డి, డోన్ అర్బన్, రూరల్ బనగానపల్లె, బేతంచెర్ల పట్టణ, రూరల్, ప్యాపిలి సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మంజునాథ్, వెంకట్రామిరెడ్డి, డోన్ అర్బన్, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, మమత తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఎమ్మెల్యే కోట్ల

బుగ్గనవి పిట్టకథలు

- ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ
- లిక్కర్ స్కాంలో వేగంగా విచారణ
- రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

డోన్ టౌన్/డోన్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గన చెప్పే పిట్ట కథలు ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని, ఆయన నీతులు చెబితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగించిన వైసీపీ ఐదేళ్ల పాటు నాశనం చేశారన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించిన జగన్, అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. వైసీపీ హయాంలో ఆర్థిక మంత్రిగా ఉండి వేల కోట్లుఅప్పులు చేసి అప్పుల మంత్రిగా పేరు పొందాడని బుగ్గనను ఎద్దేవ చేశారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బుగ్గనకు లేదన్నారు. లిక్కర్ స్కాంలో విచారణ కొనసాగుతుందని బుగ్గనతో సహా ఎవరూ అక్రమాలు పాల్పడినా శిక్ష అనుభవించాల్సిందే అన్నారు. బేతంచెర్ల మండలంలోని పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీసు శాఖలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో పోలీసులు నిష్పక్షపాతంగా పని చేస్తున్నారనీ కొనియాడారు. ఈ సమావేశంలో డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఆర్డీవో నరసింహులు, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ నాయకులు వలసల రామకృష్ణ, పెద్ద కేశవయ్యగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఆర్అండ్‌బీ, పీఆర్ డీఈలు ప్రసాద్ రెడ్డి, గంగాధర్, ఏఈలు శ్రీహరి, ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మహానందిలో యోగాంధ్ర
- జిల్లాలో అనుభవజ్ఞులైన యోగా గురువులు
- కలెక్టర్ రాజకుమారి
- పాల్గొన్న వేలాది మంది ప్రజలు



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

మహానంది, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మహానందిలో దాదాపు రెండు వేల మందితో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి ప్రతిఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. పర్యాటక ప్రాంతాలైన శ్రీశైలం, మహానంది, అహోబిలం, బెలుంగుహలు, పచ్చర్ల జంగిల్ క్యాంప్‌లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకొనేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 8 లక్షల మంది యోగాంధ్రలో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంతో అనుభవజ్ఞులైన యోగా గురువులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ యశోధర, ఐసీడీఎస్ పీడీ లీలావతి, సూపర్‌వైజర్ తోట కవిత, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్‌దౌలా, ఆలయ ఏఈవో యర్రమల్ల మధు, వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

భక్తులతో మార్మోగిన తుంగాతీరం



శ్రీ మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

మంత్రాలయం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శని,ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో మంత్రాలయానికి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణంతో పాటు మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి నిజ బృందావనానికి మొక్కులు తీర్చుకున్నారు. ఏకాదశి కావడంతో శ్రీమఠంలో అన్నదానం లేకపోవడంతో హోటళ్లకు భక్తుల తాడికి అధికమైంది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇంటర్ ఫస్టియర్‌లో 4,842 మంది విద్యార్థులు పరీక్షలకు హాజ రు కాగా 2,062 విద్యార్థులు ఉత్తీర్ణులై 43శాతం ఫలితాన్ని సాధించి రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచారు. సెకండియర్‌లో 2,892 మంది పరీక్షలకు హాజరు కాగా 2,005 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 69శాతాన్ని సాధించి రాష్ట్రంలో 6వ స్థానం సాధించారు.

- 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్‌లో 1,088 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 536 మంది ఉత్తీర్ణులై 49.26శాతం ఫలితాన్ని సాధించారు. సెకండియర్‌లో 477మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 327 మంది ఉత్తీర్ణులై 68.55 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- 57 ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫస్టియర్‌లో 2875 మంది పరీక్షలు రాయగా 1,012 మంది ఉత్తీర్ణులై 35.20శాతం ఫలితాన్ని సాధించారు. సెకండియర్‌లో 2,053 విద్యార్థులు పరీక్షలు రాయగా 1,395 మంది ఉత్తీర్ణులై 67.95శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ఒక హైస్కూల్ ప్లస్ కళాశాలకు చెందిన 17 మంది ఫస్టియర్ పరీక్షలు రాయగా 11మంది ఉత్తీర్ణులై 64.71శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 10 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు.
- ఆరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 35మంది ఫస్టియర్ పరీక్షలు రాయగా 31మంది ఉత్తీర్ణులై 88.57శాతం ఉతీర్ణతసాధించారు. సెకండియర్‌లో 17 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15 మంది ఉతీర్ణులై 88.24శాతం ఉత్తీర్ణత సాధించారు.
- మూడు ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాలలకు చెందిన 29 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 89.66 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఐదు మంది పరీక్షలు రాయగా ఐదుమంది ఉత్తీర్ణులై 100శాతం ఫలితాన్ని సాధించారు.



- 19 మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలకు చెందిన 481 మంది విద్యార్థులు ఫస్టియర్ పరీక్షలు రాయగా 242 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 50.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 233 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 179 మంది ఉత్తీర్ణులై 76.82శాతం ఉత్తీర్ణత సాధించారు.
- మూడు బీసీ రెసిడెన్షియల్ కళాశాలలకు చెందిన 14మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా 10మంది ఉత్తీర్ణులై 71.43శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 8 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100శాతం ఫలితాలు సాధించారు.
- 20 కేజీబీవీ జూనియర్ కళాశాలలకు చెందిన 303 మంది విద్యార్థులు ఫస్టియర్ పరీక్షలు రాయగా 194 మంది విద్యార్థులు ఉతీర్ణులై 64.03శాతం ఫలితాన్ని సాధించారు. సెకండియర్‌లో 89 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 66 మంది ఉత్తీర్ణులై 74.16 శాతం ఉత్తీర్ణత సాధించారు.

జగన్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత మహిళలపై జగన్‌రెడ్డి అనుచరులు వాడిన అసభ్య పదజాలం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, వెంటనే వైఎస్ జగన్ క్షమాపణలు చెప్పాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ మహిళలు, ఆడబిడ్డల జోలికి వస్తే ఎవర్నీ ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు స్పష్టంగా హెచ్చరించారన్నారు. అయినప్పటికీ జగన్ మీడియాలో అమరావతి ప్రాంత మహిళలను ఘోరంగా అవమానించడం దారుణమన్నారు. ఆ మీడియాలో ఓ జర్నలిస్టు మహిళలను కించపరిచేలా మాట్లాడిన తీరు సిగ్గుచేటన్నారు. అమరావతి మీద విద్వేషంతో జగన్ అండ్ కో చేస్తున్న అసత్య ప్రచారాలు దుర్మార్గమన్నారు. జగన్ పార్టీని ప్రజలు 11సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులు మార్పు రాలేదన్నారు. జగన్ బ్యాచ్ చేస్తున్న ఇలాంటి దిగజారుడు చర్యలను ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అమరావతి మహిళలపై చేస్తున్న నీచపు ప్రచారాలపై మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రీన్ కో రెన్యువబుల్

ఎనర్జీ ప్రాజెక్టు అద్భుతం

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎంకు వివరిస్తున్న గ్రీన్ కో ఎండీ చలమలశెట్టి

7

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం?

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

7

తుంగభద్ర తీరం సాహిత్యం





సెల్‌ఫోన్‌పై వ్యంగ్య పురాణం

కర్నూలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'పుస్తకం హస్త భూషణం' అనేది ఒకనాటి మాట. కానీ నేడు 'చరవాణి హస్త భూషణం'గా మారిపోయింది. సెల్‌ఫోన్ అత్యవసరమే అయినా, అది చేస్తున్న మాయాజాలం అంతా ఇంతా కాదు. జానపద చిత్రం బాలనాగమ్మలో మాంత్రికుడు 'మాయా దర్పణం' వద్దకు వెళ్లి ప్రపంచంలోనే అందమైన సుందరిని చూపించమని కోరగా, ఆ దర్పణం బాల నాగమ్మను చూపిస్తుంది. అలా నేడు మాయాదర్పణం రూపంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి చేతిలోకి వచ్చింది. ఒకప్పుడు జోలపాటతో నిద్రించే చిన్నారి నేడు సెల్‌ఫోన్ చూస్తూ నిద్రించే పరిస్థితి ఏర్పడింది. చందమామను చూపిస్తూ గోరు ముద్దలు తినిపించే తల్లులు నేడు సెల్‌ఫోన్లు పిల్లల చేతికిచ్చి తినిపించే దుస్థితి నెలకొంది. పెద్దలు వాహనాలు నడుపుతూ కూడా సెల్‌ఫోన్లో మాట్లాడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మాయాజాలం నుంచి మేల్కొలిపేలా తేట తెలుగు పద్యాలతో విద్వాన్ పత్తి ఓబులయ్య 'సెల్లు (సెల్ ఫోన్) పురాణం' రాశారు. ఈ పుస్తకం అందరూ చదవాలి. పది మందితో చదివించాలి.



రచయిత పత్తి ఓబులయ్య

విస్మయ పరిచే హితోక్తులు... సంతోషాన్ని పంచే చతురోక్తులు

ఈ పుస్తకంలోని తేట తెలుగు పద్యాలు అన్ని వర్గాల వారికి అర్థమవుతాయి. 'నాడు వింతలు జగమందు ఏడు కలవు...నేడు ఎనిమిదో వింతయై వేడుకగనె...వసుధ సెల్లు వింత కథల పలికెదనిట...వినుడు సెల్లు పురాణము విశదముగను' అంటూ సెల్‌ఫోన్ పుట్టుక ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా వర్ణిస్తూ పత్తి ఓబులయ్య సెల్లు పురాణం ప్రారంభిస్తారు. సెల్‌ఫోన్ రావడంతో రేడియో, కెమెరా, టార్చి వంటివన్నీ దూరమై పోయాయని, పోస్టు కార్డులు, వాచీలు, పుస్తకాలు, ఆటపాటలు, వీధి చావిట్లో ముచ్చట్లు దూరమై పోయాయని చెబుతారు. 'స్మార్టు ఫోను యుగము వచ్చె, చదువు సంధ్య... సున్న, నీలి చిత్రాలను జూచి మురిసె...జగతి మాయ, జనము మాయ, చదువు మాయ రాత్రి, పగలు మాయ, వలపు మాయ' అంటూ ఒక పద్యంలో యువత సెల్‌ఫోన్ మాయాలోకంలో తేలియాడిన రీతిని చక్కగా వివరించారు. యువత స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా, ధనము, నీతి, బాధ్యతలు వదిలి అసాంఘిక అరాచక శక్తులుగా తయారై విలువైన జీవితాలను హత్యలతో, ఆత్మహత్యలతో, హింసలతో అంతం చేసుకుంటున్నారని రాశారు. ల్యాండ్‌ఫోను భార్యవంటిదని, వెంటవచ్చే సెల్‌ఫోన్ వేశ్య ప్రవృత్తి వంటిదని చతురోక్తితో వివరిస్తారు. అలాగే 'పెరిగె సైబరు నేరాలు, వేల డబ్బు... కొల్లగొట్టిరి సెల్‌ఫోను కొట్టివేసి...అరనిమిషములో యావిరి యయ్యె డబ్బు...వినుడు సెల్లు పురాణము విశదముగను' అంటూ సెల్‌ఫోన్ల ద్వారా పెరిగిన సైబర్ నేరాలను వివరిస్తారు. మొత్తం 140 తేట తెలుగు పద్యాలతో కూడిన ఈ పుస్తకంలో ప్రతి పద్యం ఒక ఆణిముత్యం.

సమాజశ్రేయస్సును ఆకాంక్షించే 'సెల్లు పురాణం'...

కర్నూలుకు చెందిన విద్వాన్ పత్తి ఓబులయ్య వృత్తిరీత్యా ప్రిన్సిపాల్‌గా సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో పనిచేసి విశ్రాంత జీవితం కొనసాగిస్తున్నారు. ఆయన గతంలో తొమ్మిది పుస్తకాలు రాశారు. పదో పుస్తకంగా 'సెల్లు (సెల్‌ఫోన్) పురాణం' ఇటీవలే ఆవిష్కరించారు. నాటక రంగంలో విశేషానుభవం ఉన్న పత్తి ఓబులయ్య కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి కళారత్న (హంస పురస్కారం) అందజేసింది. సమాజంలో ఒక రుగ్మతలా తయారైన సెల్‌ఫోన్ల వాడకంలో మార్పు వస్తుందనే ఆశాభావంతో ఈ పుస్తకం రాశానని ఆయన ఈ పుస్తకంలో తెలిపారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య తన ముందుమాటలో ఇది నేడు అన్ని వర్గాల వారికి ఎంతో అవసరమైన పుస్తకం అన్నారు. అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో ఇది లభిస్తుంది.



కెంగార మోహన్
పుస్తక విశ్లేషకులు

కొత్తూరులో తెలంగాణ సంగీత అకాడమీ చైర్‌పర్సన్ పూజలు



చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానంలో శనివారం తెలంగాణ రాష్ట్ర సంగీత అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య కుంజాల ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో శేషవస్త్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కు టుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది సుబ్బా రెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కళాసరయు..



చదువుతో పాటు కళల్లోనూ రాణిస్తూ అందరి చేత ఔరా అనిపించుకుంటోంది నంద్యాల పట్టణానికి చెందిన సరయు. ఈమె కూచిపూడిలో ప్రత్యేక ప్రతిభను చాటుతోంది. శాస్త్రీయ నృత్యం, ముఖాభినయనం, చిత్రలేఖనం వంటి వాటిలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ చిన్న వయస్సులోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక సాంస్కృతిక ప్రదర్శనలిచ్చి అందరిచే ప్రశంసలందుకుంది. చిన్న తనం నుంచే నృత్యం, ఆటలు సాంస్కృతిక అంశాలను నేర్పిస్తే చిన్నారులు ప్రతిభావంతులుగా తయారువుతారనడానికి ఈ చిన్నారి సాధిస్తున్న విజయాలే తార్కాణం.

-నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)







విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నృత్యప్రదర్శన సందర్భంగా మంత్రి సత్యకుమార్‌చే అభినందన

- చదువుతో పాటు కళల్లో కూడా దిట్ట
- కూచిపూడిలో ప్రతిభ
- చిత్రలేఖనంలో ప్రావీణ్యం
- నేటి తరం బాలికలకు ఆదర్శం
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు
- అందరితో ప్రశంసలు

ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ..

నంద్యాల గురురాజా విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, సింధు దంపతుల కుమార్తె 'సరయు' 7వ తరగతి చదువుతోంది. ఆమెకు చదువుతో పాటు నృత్యం, చదరంగంపై ఆసక్తి ఉండేది. ఇది గుర్తించిన తల్లిదండ్రులు కుమార్తెను ప్రోత్సహించారు. చిన్నతనం నుంచే నృత్యం, ఆటలు సాంస్కృతిక అంశాలను నేర్పిస్తే చిన్నా రులు ప్రతిభావంతులుగా తయారువుతారని ఈచిన్నారి సాధిస్తున్న విజయాలే తార్కాణం. తల్లిదండ్రులు ప్రోత్సాహం కూడా తోడైతే ఉన్నతిస్థితికి చేరుతారు అనడానికి ఈచిన్నారి సరయు బహుమ తులే నిదర్శనం. చిన్నారి సరయు ఐదేళ్ల వయస్సు నుంచి పాఠశాల మాస్టర్ల వద్దనే కూచిపూడిలో ప్రత్యేక శిక్షణ తీసుకుం టుంది. సాయంత్రం వేళలో ప్రణాళికాబద్ధంగా మెలకువలు నేర్చుకుంటూ ఒక వైపు ఆధునిక నృత్యం, జానపద నృత్య ప్రదర్శనలో రాణిస్తూ.. మరోవైపు ముఖాభినయనం, చిత్రలేఖనంతో పాటు చదువులోనూ అనేక రకాల టాలెంట్ టెస్ట్‌ల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అన్నింటిలోనూ అత్యుత్తమ ప్రతిభా పురస్కా రం అందుకోవడం ఆల్ రౌండర్ ప్రతిభకు నిదర్శనం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.



'సరయు' సాధించిన బహుమతులు

- 2018లో కర్నూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ స్థానం.
- 2019 గుంటూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండుగ జాతీయస్థాయి బాలోత్సవంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు బహుమతి సాధించింది. నంద్యాల కళారాధన సంస్థ వారు సరయు ప్రతిభలకు నిదర్శనంగా బాలరత్న పురస్కారం ప్రదానం చేశారు.
- 2020లో మైల్‌స్టోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ లో ప్రత్యేక బహుమతి.
- 2021లో హైదరాబాద్‌లో సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన సీవీ రామన్ సైన్స్‌ఒలంపియాడ్‌లో మూడు సార్లు గోల్డ్‌మెడల్ సాధించి రవీంద్ర భారతిలో బహుమతి అందుకుంది.
- 2022లో జాతీయ స్థాయి బాలోత్సవంలో ప్రతి సంవత్సరం కథ చెప్పడం వకృత్వం, ముఖాభినయనం పోటీల్లో ప్రథమ, ప్రత్యేక బహుమతులు సాధించారు.
- 2023లో కళారాధన సంస్థ నిర్వహించిన ఏకపాత్రాభినయనం పోటీల్లో ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణతో ప్రథమ బహుమతి సాధించినది. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో భగత్ సింగ్ వేషధారణలో ప్రథమ బహుమతిని సాధించింది.
- 2024లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శనలో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో బహుమతిని అందుకున్నారు.
- 2024లో నంద్యాల నంది బాలోత్సవంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్యప్రదర్శనలో ప్రథమ బహుమతి దక్కింది.
- 2024లో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినది.
- 2024లో ఏపీ టూరిజం వారు నిర్వహించిన జిల్లాస్థాయి ఫిల్మ్ డాక్యుమెంటరీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి కలెక్టర్‌తో అందుకుంది.
- 2025లోజాతీయ సైన్స్ దినోత్సావాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎక్స్‌పోలో ప్రథమ బహుమతి కైవసం.



రాష్ట్రస్థాయిలో సర్‌సివి రామన్ యంగ్‌జీనియస్ గోల్డ్‌మెడల్ అందుకుంటున్న "సరయు"



మంత్రి ఫరూక్‌చే మెమెంటో అందుకుంటూ..



రవీంద్రభారతిలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న "సరయు"

జీడీపీ నుంచి నీరు విడుదల

- ఖరీఫ్‌లో సాగు నీరు విడుదల చేయాలంటున్నరైతులు
- తాగునీరు పథకాలకు ఇబ్బంది వస్తే ఎలా?
- జీడీపీలో కేవలం ఉన్నది 1.1 టీఎంసీలే
- లీకేజీ నీరు అంటున్న అధికారులు

గోనెగండ్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎడవ కాలువ ద్వారా శనివారం నీరు విడుదల చేశారు. జీడీపీ కింద సాగునీరు కేవలం రబీ సీజన్‌లో మాత్రమే విడుదల చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్ సీజన్‌లో నీటి విడుదల ఏమిటని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. జీడీపీ ఎడవ కాలువ వెంట ఉన్న పంట భూములకు సాగునీరు కోసం నీటిని విడుదల చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీటితో ఈ ఏడాది వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరే వరకు తాగునీటి పథకాలకు నీరు సర్దాల్సిఉంది. అయితే ఉన్న నీటిని ఖరీఫ్ సీజన్‌లో పొలాలకు విడుదల చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే నీటి విడుదల జీడీపీ అధికారులకు తెలిసి జరిగిందా లేక కొంతమంది రాజకీయ బలంతో అధికారులకు చెప్పకుండా నీటిని విడుదల చేసుకున్నారా? అన్నది స్పష్టత లేదు. జీడీపీ అధికారులకు తెలిసే నీటి విడుదల జరిగినట్లు మరి కొంతమంది తెలుపుతున్నారు.

నీరు నీరు లీకేజీ అవుతోంది

గాజులదిన్నె ప్రాజెక్టు ఎడవ కాలువ వెంట వెలుతున్న నీరు లీకేజీ నీరు మాత్రమే అంతే కాని జీడీపీ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయలేదు. లీకేజీ అవుతున్న నీటికి కూడా అడ్డుకట్ట వేస్తాము. తాగునీటి పథకాలకు నీటి సమస్యను రాకుండా చూస్తాము.

● విజయ్‌కుమార్, డీఈ, జీడీపీ



ఎడవ కాలువ ద్వారా నీరు పారుతున్న దృశ్యం

నిర్లక్ష్యం మానైంది



నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కర్నూలు కలెక్టరేట్ భవన సముదాయాలు నిలుస్తాయి. ఈ ప్రాంగణంలోనే కలెక్టర్ వసతి గృహం కూడా ఉంది. కలెక్టరేట్ భవన సముదాయంలో అన్నిప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగు తాయి. శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయం పక్కన ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం (ఏపీడబ్ల్యూఐపీ) కార్యాలయం వెనుక భాగం గోడపైన రాగిచెట్టు పెరిగి మాను అవుతోంది. ఈచెట్టు ఇలాగే పెరిగితే.. భవనం ప్రమాదస్థాయికి చేరుకుంటుంది. ఈభవనంపై పెరుగు తున్న చెట్టు అధికారుల కన్నులకు కనిపించలేదా.. లేక భవనంపై పెరిగితే ఏమీ కాదులే అనుకున్నారేమో తెలియదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో చిత్తశుద్ధి లోపించిందనడానికి ఇదే ఒక నిదర్శనం.

- కర్నూలు ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి)

సోయగమనం

- నల్లమలలో అల్లుకుపోయిన పచ్చదనం
- ప్రయాణికుల్ని కనువిందు చేస్తున్న వన్యప్రాణులు
- అటవీ ప్రాంతం మీదుగా ఆహ్లాదకర ప్రయాణం

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లమల అందాలు మైమరిపిస్తున్నాయి. జీవ వైవిధ్యానికి మారుపేరైన నల్లమల అడవులు ప్రకృతి రమణీయతను సంతరించుకున్నాయి. ఈఏడాది మే నెలలో కురిసిన వర్షాలతో అడవంతా పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రత్యేకించి కర్నూలు-గుంటూరు(కేజీ) జాతీయ రహదారికి ఇరువైపుల విస్తరించిన నల్లమల అడవి ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆరోడ్డుకు ఇరువైపుల వున్న వృక్షాలు రహదారిని కమ్మేసేలా దర్శనమిస్తూ పచ్చదనంతో స్వాగతం పలికేలా ఆకర్షణగా నిలిచాయి. దీంతో కేజీ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు మార్గమధ్యంలో నిలిచి నల్లమల అందాల ఆస్వాదిస్తూ.. ఆనందిస్తున్నారు. అనేక రకాల గడ్డి జాతులతో పచ్చికబయళ్లు వ్యాపించడంతో ఆప్రదేశాల్లో జింకలు, ఇతర వన్య ప్రాణులు ప్రయాణికుల్ని మధురాను భూతిని కలిగిస్తున్నాయి.





కనువిందు చేస్తున్న జింకలు



పచ్చదనాన్ని సంతరించుకున్న కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి

మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి

బైర్లూటి నుంచి దోర్నాల సమీపంలోని కొర్రప్రోలు వరకు కేజీ రహదారి ఇలాగే పచ్చదనాన్ని సంతరించుకోవడంతో ఆమార్గం గుండా వెళ్లే ప్రయాణికుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో పశుపక్షాదుల శబ్దాలు నల్లమల ప్రయాణంలో చెరిగిపోని జ్ఞాపకాలను నింపుతున్నాయి. దారిపొడవునా వివిధ రకాల సీతాకోకచిలుకలు కనువిందు చేస్తున్నాయి. శ్రీశైలం రేంజ్ పరిధిలోని శ్రీశైలం-దోర్నాల రహదారి కూడా పర్యావరణ ప్రేమికుల్ని ఆకట్టుకుంటుంది. రోడ్డుకు ఇరువైపుల పచ్చదనం ఉండటంతో శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇదిలా వుంటే ఆత్మకూరు నుంచి వెలుగోడుకు వెళ్లే రహదారి కూడా అడవంతా పచ్చదనంతో అల్లుకుపోయింది. దీంతో ఆమార్గంలో వెళ్లే ప్రయాణం కూడా ఆహ్లాదకరంగా మారింది.,

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ ఎస్ కినగి కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.



శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ ఎస్ కినగి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో ఘటన


సనావుల్లా, సమీర్ (ఫైల్)

ఆత్మకూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు నంద్యాల రహదారిలోని వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సనావుల్లా (20), సమీర్ (20) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. షేక్షావలి అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం జరిగింది. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వెలుగోడు పట్టణానికి చెందిన సమీర్, సనావుల్లా, షేక్షావలి కేక్ కోసం ఓ బైక్‌పై శనివారం సాయంత్రం ఆత్మకూరుకు బయలు దేరారు. మార్గమధ్యంలో వైఎస్ఆర్ స్మృతివనం సమీపంలో గుర్తు తెలియని వాహనం ప్రమాదవశాత్తు వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో సనావుల్లా, సమీర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా షేక్షావలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో క్షతగాత్రులను వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మకూరు సీఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని తీవ్రగాయాల పాలైన షేక్షావలిని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమారులు మృతితో ఆసుపత్రిలో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచి వేశాయి. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ రాము వెల్లడించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి...

ఆదోని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని- కోసిగి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని బసన్న(56) మృతి చెందాడు. రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు తెలిపిన వివరాలు మేరకు శుక్రవారం రాత్రి 10 సమయంలో కోసిగి ఎల్‌సీ గేటు 205 వద్ద 523/33-35 కేమీ దగ్గర అప్‌లైన్ ట్రాక్‌లో జంపాపురం బసన్న దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. బసన్నకు చెవులు సరిగా వినపడనందున ఈ ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నీటి కుంటలో పడి బాలిక..


రోధిస్తున్న తల్లి, బంధువులు, ఇన్‌సెట్‌లో రూప(ఫైల్)

చిప్పగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మరో ఐదు రోజులలో పాఠశాలలు తెరిచాక బడికి వెళ్లాల్సిన బాలిక నీటి కుంటలోపడి మృతి చెందింది. చిప్పగిరి మండలం, దౌల్తాపురం గ్రామంలో రూప(10) అనే బాలిక శనివారం ఉదయం పొట్టేలును మేపడానికి పొలాల్లోకి వెళ్లింది. అక్కడున్న నీటి కుంటలో ప్రమాదవశాత్తుపడి మృతి చెందింది. బాలిక తండ్రి బాలు ఆటో డ్రైవర్, తల్లి శకుంతల వ్యవసాయ కూలీ. వీరికి ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురు రూప 5వ తరగతి పూర్తి చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైతే ఆరో తరగతిలో చేర్పాల్సి ఉంది. బాలిక మృతి గ్రామంలో విషాదం నింపింది.

అరుగుపై నుంచి పడి వ్యక్తి..

బేతంచెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు (30) అనే వ్యక్తి గురువయ్య పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న స్వామి కాంప్లెక్స్ వద్దనున్న అరుగుపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నివాసముంటున్న కురువ వెంకటేశ్వర్లు స్వామి కాంప్లెక్స్ అరుగు మీద పడుకుని ఉండగా.. ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు బలమైన గాయం కావడంతో చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం బేతంచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య లావణ్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆళ్లగడ్డ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న లక్ష్మీ డీటీహెచ్ సర్వీస్ సెంటర్‌లో శనివారం పోలీసులు గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రుద్రవరం మండలం నల్లవాగు పల్లె గ్రామానికి చెందిన రామలింగేశ్వరరెడ్డికి చెందిన డీటీహెచ్ సర్వీస్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాకెట్‌లో సుమారు కేజీ గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. షాపు యజమాని రామలింగేశ్వరరెడ్డిని అదపులోకి తీసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.


పోలీసులు స్వాదీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్

రెండు రాష్ట్రాలకూ గుండ్రేవుల అవసరం

- తెలంగాణ డిప్యూటీ సీఎంకు టోల్ ప్లాజా వద్ద స్వాగతం
- వినతులతో కలిసిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు

కర్నూలు, అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టు అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం కర్నూలు నగర శివారులోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్‌కు ఉమ్మడి జిల్లాల నాయకులు ఘన స్వాగతం పలికారు. నంద్యాల డీసీసీ జె. లక్ష్మీనరసింహ, కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ కలిశారు. నంద్యాల జిల్లా పిన్నాపురం సోలార్ పవర్ ప్లాంట్ పరిశీలన కోసం వెళ్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎంను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే రెండు రాష్ట్రాల సాగు, తాగు నీటి కష్టాలు తీరుతాయని అన్నారు. దీని కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రజాక్ వలీ, హైమావతి, లాజరస్ పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పంట వ్యర్థాలతో భూసారం


వరి కొయ్యలను కాలుస్తున్న రైతు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అసలే మన జిల్లాల్లోని నేలలో సేంద్రియ కర్బనశాతం తక్కువ. నేలలో సహజంగా కోట్ల సంఖ్యలో సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, శిలీంద్రాలతో పాటు వేల సంఖ్యలో కీటకాలు, వానపాములు, నులిపురుగులు ఉంటాయి. ఇవన్నీ సేంద్రియ పదార్థాలు కుళ్లేలా చేసి మొక్కలకు పోషకాలను అందించి భూసారాన్ని కాపాడుతాయి. పంట వ్యర్థాలను రైతులు కాల్చివేస్తే నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు, మిత్రపురుగులకు తీవ్ర నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పైగా పంట వ్యర్థాలను తగులబెట్టేటప్పుడు వెలువడే పొగ వల్ల తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతుంది. ఈ కారణం వల్ల కూడా పంట వ్యర్థాలను విచక్షణా రహితంగా కాల్చివేయకూడదు.

- వరి కొయ్యలను కాల్చేస్తే నేలకు నష్టం
- ప్రమాదకరస్థాయిలో పడిపోయిన సేంద్రియ కర్బనం
- పొలాన్ని కలియదున్నితే పంటలకు మేలంటున్న శాస్త్రవేత్తలు

సాగు విధానంలో మార్పులు శాస్త్రీయంగా ఉండాలి. గతంలో వరి పంటను కొడవళ్లలో మొదళ్ల దాకా కోసేవారు. అయితే ప్రస్తుతం మిషన్‌తో వరిపంటను అడుగు మేర కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో దున్నే సమయంలో రైతులు నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని వరికొయ్యలను తగులబెడుతున్నారు. దీ ని వల్ల భూసారానికి నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది

వరి కొయ్యలను కాల్చితే రైతులకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. విపరీతమైన వేడితో నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. పంటలకు అవసరమైన ఖనిజ, లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, తొండల్లాంటి అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.



పొలాన్ని కలియ దున్నితే కలిగే లాభాలు



- వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం వరకు అధికంగా వచ్చే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్‌ఫాస్పేట్ చల్లితే వరి కొయ్యల అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- సూపర్ ఫాస్పేట్ చల్లితే భూమి చౌడుబారడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుంది.
- కలియ దున్నడం వల్ల ఎకరాకు టన్ను వరకు ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని(యూరియా), నాలుగు శాతం ఫాస్పరస్ అదనంగా అందిస్తుంది. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తుంది.

● తగ్గిపోయిన సేంద్రియ కర్బనశాతం

ఉమ్మడి జిల్లాల్లో సేంద్రియ కర్బనశాతం చూస్తే దిగ్భ్రాంతికరంగా ఉంది. అధికంగా ఉష్ణోగ్రతలుండే మన భూముల్లో సేంద్రియ పదార్థం త్వరగా అంతరించిపోతుంది. సాధారణంగా 0.08శాతం నుంచి 0.75శాతం ఉండాల్సిన సేంద్రియ కర్బనశాతం మన నేలల్లో 70శాతం భూముల్లో 0.05శాతం కంటే తక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. రసాయన ఎరువులను అధికంగా వాడడం, పొలాల్లో వ్యర్థాలను కాల్చడం వంటి చర్యలతో మరింత కర్బనశాతం పడిపోయి పంట దిగుబడి తగ్గిపోతుంది. మట్టిలో పశువుల ఎరువు, పచ్చిరొట్టి ఎరువులు, పంట మిగులు వంటివి విరివిగా వాడడం వల్ల మట్టిలో సేంద్రియ కర్బనశాతం పెంచవచ్చు.

నేల భౌతిక లక్షణాలు దెబ్బతింటాయి



రైతులు అధికంగా రసాయనాలు వాడడం, పంట వ్యర్థాలను కాలిస్తే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోవడం వల్ల నేల భౌతిక లక్షణాలు దెబ్బతింటాయి. కేంద్ర కర్బనశాతం ఆవిరైపోయి సూక్ష్మజీవులు నశించి దిగుబడులు కూడా తగ్గిపోతాయి. ఒక ఎకరాలో వరికొయ్యలను భూమిలో కలియదున్నడం వల్ల రెండు ట్రాక్టర్‌ల ఎరువు లభిస్తుంది.

● కేవీ రమణయ్య, భూసార శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం

దిగుబడి తగ్గిపోతుంది



వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగుల కోల్పోవడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుంది. వరి కొయ్యలు పొలంలో కలియదున్నాలని రైతులకు వ్యవసాయ సదస్సుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

● మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

గ్రీన్‌కో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు అద్భుతం

- తెలంగాణలో కూడా ఏర్పాటు చేస్తాం
- ప్రాజెక్టును సందర్శించేందుకే వచ్చా
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓర్వకల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ప్రతిష్ఠాత్మక గ్రీన్-కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు ఒక అద్భుతమని తెలంగాణ రాష్ట్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని గుమితం తండా సమీపాన ఉన్న సోలార్ పార్కు గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును టీఎస్ డిప్యూటీ సీఎంతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సందర్శించారు. అంతకుముందు తెలంగాణ డిప్యూటీ సీఎంకు గ్రీన్‌కో ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గ్రీన్ కో అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అప్పర్ ఇన్‌టెక్ పాయింట్ సోలార్ పార్కు గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు విండ్ పవర్ ప్రాజెక్టులను రిజర్వాయరు నుంచి నీటిని పైపులైన్ ద్వారా టర్బైన్‌ల వరకు సరఫరా చేసే విధానాన్ని వారు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో టీఎస్ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు ప్రపంచంలో మొట్టమొదటిదన్నారు. ఇలాంటి ప్రాజెక్టు మన దేశంలో ఉండటం గర్వకారణ మన్నారు. తెలంగాణలో కూడా ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా వచ్చానన్నారు. గ్రీన్ కో సంస్థ అనుకున్న సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసి కరెంటు ఉత్పత్తి చేస్తుందన్నారు. సోలార్ ద్వారా 4వేల మెగా వాట్ల విద్యుత్, విండ్ హైడ్రా ద్వారా 2వేల గ్రీన్ ఎనర్జీ ఇక్కడి నుంచి ఉత్పత్తి చేస్తున్నదని అన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివా సులు, గ్రీన్ కోఅసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసనాయుడు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, జూన్7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద శుక్రవారం అర్ధరాత్రి మద్దిలేటి అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. పాణ్యం మండలం అనపూరు గ్రామానికి చెందిన మద్దిలేటి తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆయనకు రెండు కాళ్లు, ఒక చెయ్యి తెగిపోయాయని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. మద్దిలేటికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం?

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి


మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.81 వేల కోట్లతో ప్రకటించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎవరి కోసం నిర్మిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం కేకే భవన్‌లో జిల్లా కార్యదర్శి జి. రామక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సాగునీటి అవసరాలను తీర్చాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.13.844 కోట్లు అవుతుందన్నారు. వీటి నిర్మాణం పూర్తి అయితే కొత్తగా సాగునీరు అందించే ఆయకట్టు 13,80,529 ఎకరాలు అన్నారు. వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించకుండా రూ.81 వేల కోట్లతో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్ల కోసం రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చవద్దని అన్నారు.

మూడు నిమిషాలు ఆగిన వందేభారత్

కోసిగి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి గుల్బర్గా వెళ్తున్న 22232 నెంబరు గల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసిగి రైల్వే స్టేషన్‌లో మూడు నిమిషాల పాటు ఆగింది. శనివారం కురిసిన వర్షానికి సిగ్నల్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. సిగ్నల్ సమస్య రావడంతో వందేభారత్ లోకోపైలట్ కోసిగి స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడి రైలును మూడు నిమిషాలు నిలిపారు. సమస్య పరిష్కారం కావడం రైలు గుల్బర్గా వైపునకు కదిలిందని స్టేషన్ కౌశల్‌కుమార్ తెలిపారు.

లాడ్జీల ధరలకు రెక్కలు

- భక్తుల నుంచి నిలువు దోపిడీ
- రూ.300 రూం రూ.15వేలు
- భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని డిమాండ్
- బలవంతంగా వసూలు
- పట్టించుకోని అధికారులు


మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్

మంత్రాలయం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ప్రైవేటు లాడ్జీల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ప్రైవేటు లాడ్జీల యజమానులు నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. రూ.300లు గల అద్దె ఉన్న గదిని ఏకంగా రూ.15వేలు పెంచి భక్తుల నుంచి ముక్కు పిండి వసూలు చేశారు. బక్రీద్, ఆదివారం వరుస సెలవు దినాలు రావడంతో శుక్రవారం నుంచి శనివారం రాత్రి వరకు భక్తుల రద్దీని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు లాడ్జీల యజమానులు అమాంతంగా గదులకు రేట్లను పెంచేశారు. గంటకు ఓ రేటు పెట్టి భక్తులను దోచుకుంటున్నారు. ఇంత పెద్ద మొత్తం లో చెల్లించలేని సాధారణ పేద, మధ్యతరగతి భక్తులు పిల్లాపాపలతో, తల్లిదండ్రులు, వృద్ధులతో మధ్వమార్గ్ కారిడార్‌లోనే బస చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇళ్లను సైతం లాడ్జీలుగా మార్చేసి..

కొంత మంది ఇళ్లను సైతం లాడ్జీలుగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్న ఇంట్లోనే స్నానానికి రూ.250 నుంచి రూ.300 ప్రకారం ఇవ్వడంతో మంత్రాలయంలోని పలు ఇళ్లు మూడు పూవులు, ఆరు కాయలుగా భక్తులను ఆహ్వానించి డబ్బు సంపాదిస్తున్నారు. అందనంత రేట్లు పెట్టడంతో పిల్లాపాపలతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. మంత్రాలయంలో దాదాపు 10వేల నుంచి 15వేల దాకా వసతి కల్పించేందుకు అనుకూలంగా ఉంది. 60వేల నుంచి 80వేల మంది పైగా భక్తులు తరలివచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు లాడ్జీల యజమానులు రేట్లను అమాంతంగా పెంచేసి కృత్రిమ కొరత సృష్టించారు. ప్రైవేటు లాడ్జీల యజమానులు మిలాఖత్ అయ్యారు. మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన దాదాపు 1500 రూములు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని నిండిపోవడంతో కర్ణాటక గెస్టుహౌస్, అబోడే హోటల్, శ్రీనికేతన్ నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాడ్జీల్లో 3 గంటలకు ఒక రేటు పెట్టి, ఆ స్నానానికి, కాలకృత్యాలకు ఓ రేటు పెట్టి నిమిషం దాటినా రూ.వేలలో వసూలు చేయడం దారుణంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడం తోనే ప్రైవేటు లాడ్జీల యజమానులు భక్తులను దోచేసుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, కుడా అధికారులు చర్యలు తీసుకుని లాడ్జీల ధరలకు కల్లెం వేసేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


గడివేములలో..


కొత్తపల్లి మండలం శివపురం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు




ఆత్మకూరు, నంద్యాల పట్టణాల్లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జూపాడుబంగ్లాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


నందికొట్కూరు ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


వెలుగోడులో..


పాములపాడులో...

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాను స్మరించారు. మత పెద్దలు పండుగ ప్రాశస్త్యాన్ని వివరించి ప్రపంచం సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం ముగిసిన 70రోజుల తర్వాత దైవప్రవక్త త్యాగాన్ని స్మరిస్తూ బక్రీద్ వేడుకలను జరుపుకొంటున్నట్లు చెప్పారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఖబరస్తాన్‌కు చేరుకుని తమ పితరులను స్మరించి వారి ఆత్మశాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు. అదేవిధంగా బక్రీద్ పండుగ సంప్రదాయం ప్రకారం దానధర్మాలు చేశారు. ముస్లింలు ఆనందంగా గడిపారు. సంప్రదాయ దుస్తులతో ధరించి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమాం పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

నందికొట్కూరు: నియోజకవర్గ వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని కర్నూలు రోడ్డు మార్గంలో ఉన్న సున్నత్ జమాద్ ఈద్గా వద్ద, ఆలే-హదీస్ ఈద్గాల వద్ద మత పెద్దలు, ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో ఒక వర్గం వారు ఉదయం 7 గంటలకు ప్రార్థనలు నిర్వహించగా, మరో వర్గం వారు 9 గంటలకు ప్రార్థనలు నిర్వహించారు.

వెలుగోడు: పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. వెలుగోడు ఈద్గాలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొత్తపల్లి: బక్రీద్ పర్వదినం బక్రీద్ విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని శివపురం, దుద్యాల, కొత్తపల్లి, నందికుంట, ముసలిమడుగు, కొక్కెరంచ, ఎదురుపాడు, తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. త్యాగానికి, సహనానికి బక్రీద్ ప్రతీక అని మత పెద్దలు తెలిపారు.

మహానంది: మండలంలో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని గాజులపల్లి, బుక్కాపురం, తిమ్మాపురం, నందిపల్లిగోపవరం, మసీదుపురం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లీములు నమాజులు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఆత్మీయ అలింగనం చేసుకొన్నారు త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. ప్రతి ఒక్కరు ఓర్పు సహనంతో జీవించాలని ముస్లింలు మత పెద్దలు కోరారు.

మానవతను వ్యాప్తి చేయడమే బక్రీద్ లక్ష్యం


ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

నంద్యాల రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం ప్రతి వారి జీవితంలో మానవత్వం అనేది వెల్లి విరియాలని బక్రీద్ పండుగ తేటతెల్లం చేస్తుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు.. శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పలు ఈద్గాలలో మత గురువులతో కలిసి ఆయన నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్రను చేయాలన్న నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఎలాంటి రాగ ద్వేషాలకు తావు లేకుండా మంచి మనసుతో, మానవత్వంతో, శాంతి, సమైక్యతతో ముందుకు నడవాలన్నారు. బక్రీద్ ఎంతో పవిత్రమైన త్యాగమైన రోజు అని ఇందులో ప్రేమ, స్నేహం వెల్లివిరియాలన్నారు. ఈ ప్రార్థనల్లో ఇమామ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు అంజద్ బాషా సిద్ధిఖి, మతగురువులు మౌలానా మహబూబ్ బాషా, ముఫ్తీ మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు


గోపూజలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూన్ 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల మూలమఠంలో వెలసిన భీమలింగేశ్వర స్వామి దేవస్థానం సీజీఎస్ నిధులతో పున: నిర్మాణ పనులను శనివారం ఆలయ ఈవో వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం మహాగణపతి పూజ, గోపూజ, మూలమంత్ర జపాలు, మూలమూర్తులకు పంచామృత విధంగా రుద్రాభిషేకం, అగ్ని ప్రతిష్ఠా దీక్షాహోమం, రుద్ర హోమం, అఘోర మంత్రాల విగ్రహ దేవత మంత్రము, ఆలయ బలి, మహామంగళహారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

11న మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

పాణ్యం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 11 వతేదీన పాణ్యం వ్యవ సాయ మార్కెట్ యార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతుందని గడివేముల మండల టీడీపీ నాయకులు కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాణ్యం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే ప్రమాణ స్వీకారానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ నాయకులు గౌరువెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ప్రమాణ స్వీకారమహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పోలీసుల బందోబస్తు : ఎస్పీ


బందోబస్త్‌లో గస్తీ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో పటిష్ఠ పోలీస్ బందోబస్త్ ఏర్పాటుచేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు బందోబస్త్ కార్యక్రమాలు నిరంతరం నిఘాతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛ య సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఈద్గా, మసీదులలో నవాజ్‌లు చేసుకోవడానికి అన్నివిధాల పర్యవేక్షిస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పార్కింగ్‌కు స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థనా స్థలాల పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

అహోబిలంలో చీఫ్ ఇంజనీర్ పూజలు

ఆళ్లగడ్డ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలంలో ఏపీ ఎస్పీ డీసీఎల్ తిరుపతి చీఫ్ ఇంజనీర్ ఆదిశేషయ్య శనివారం కుటుంబ సమేతంగా లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ప్రత్యేక పూజలు చేసి నవ నరసింహ స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య, ఆళ్లగడ్డ విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏడీఈ రమేష్‌కుమార్, ఏఈ క్రిష్ణయ్య పాల్గొన్నారు.

శ్రీశైలంలో కేంద్ర మంత్రి సంజయ్‌సేతు

నంద్యాల కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంక్షేత్రాన్ని యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ డిఫెన్స్ సంజయ్ సేతు శనివారం సందర్శించారు. శ్రీశైలంలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శనార్థం వచ్చిన యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ డిఫెన్స్ సంజయ్ సేతు ఆలయ ముఖమండపం వద్ద శ్రీశైలదేవస్థానం పిఆర్ఓ శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఆలయ పీఆర్వో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, తదితర పూజలు నిర్వహించారు.

● శ్రీశైలంక్షేత్రాన్ని పాట్నా హైకోర్టు పార్మర్ చీఫ్ జస్టిస్ నరసింహారెడ్డి శనివారం సందర్శించారు. భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తికి ఆలయ ముఖమండపం వద్ద శ్రీశైల దేవస్థానం పీఆర్వో శ్రీనివాసరావు స్వాగతం పలికారు. మల్లిఖార్జున స్వామి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, పూజలు చేశారు.

'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. శనివారం మండలంలోని కురుకుంద గ్రామంలో వ్యకాస మండల నాయకులు ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారికి ఉద్యోగాలు రాక, ఉపాధి అవకాశాలు లేక నిత్యం పొట్ట కూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లి అక్కడ కూడా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి హామి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 9వారాల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కరివేన, వడ్లరామాపురంలో ఉపాధి పనులు లేక రెండు వారాలు అవుతున్నా పట్టించుకునే నాధుడే కరువ య్యారన్నారు. ఎంపీడీవో అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించి, వలసలను నివారించాలని లేని పక్షంలో ఉపాధి కూలీలను సమీకరించుకుని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యకాస మండల నాయకులు లింగస్వామి, దీనుడు, నరసయ్య, రమణ పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత గ్యాస్ ఏజెన్సీ వారు సిలిండర్‌ను ఇంటికి తీసుకురావాలి. అయితే డెలవరీ బాయ్స్ ఇష్టానుసారంగా వినియోగదారుల నుంచి డబ్బులు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వారు అడిగిన కాడికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేకపోతే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డెలవరీ అధనం!



- ఒక్కో సిలిండర్‌పై రూ.30నుంచి 60 వరకు వసూలు
- ఐవీఆర్ఎస్ సర్వేలో వెల్లడి
- వినియోగదారులకు తప్పని 'బండ' బాదుడు

నంద్యాల నూనెపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులకు బండ బాదుడు తప్పడంలేదు. సిలిండర్ బుక్ చేసుకున్నాక గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది నుంచి సిలిండర్‌ను ఇంటికి తెచ్చినప్పుడు నిర్ణీత ధర కంటే అదనంగా రూ.30నుంచి రూ.60వరకు వసూలు చేస్తున్నారు. పెరిగిన గ్యాస్ ధరతో ప్రజలపై అదనపు భారం పడినట్లయింది. దీనికి తోడు సిలిండర్ డెలివరీ సమయంలో అదనంగా వినియోగదారుడి నుంచి వసూలు చేయడం మరింతగా భారం పడినట్లయింది. వాస్తవానికి నిర్ణీత దూరంవరకు ఉచితంగానే సరఫరా చేయాలి. వినియోగదారులు చెల్లించే బిల్లులోనే ఇందుకు సంబంధించిన చార్జీలు కలిసి ఉం టాయి. వాటిని పాటించకుండా ఏజెన్సీ సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు మార్లు ఈఅంశంపై కలెక్టర్, జేసీలు అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశాల్లో సమస్య పరిష్కారంపై పలు సూచ నలు చేస్తున్నప్పటికీ పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం, ఆ దిశగా అడుగులు వేయకపోవడంపై పలు విమర్శలకు దారితీస్తోంది.

5కి.మీ.లోపు ఉచితం

సిలిండర్ సరఫరా విషయంలో పలు నిబంధనలు ఉన్నాయి. 5కి.మీ.లోపు ఉచితంగా, 5కి.మీ.దాటితే రూ.20, 10కి.మీ.తర్వాత రూ.30, 15కి.మీ.దాటితే రూ.40 వినియోగదారుల నుంచి అదనంగా తీసుకోవచ్చు. జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని పలు పట్టణాల్లో అమలుకు విరుద్ధంగా అధికవసూళ్లు చేస్తున్నారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్లు తదితర చోట్ల కమర్షియల్ సిలిండర్లు వాడాల్సి ఉన్నా గృహ సిలిండర్లు వినియో గిస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ సంబంధిత అధికారులు అడుకట్ట వేయడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యా ర్థం 1967టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసింది. అక్రమాలు జరిగితే ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

చర్యలు ఉంటాయి

సిలిండర్‌కు రశీదుపై ఉన్న మొత్తంకంటే అదనంగా వసూలు చేస్తే సదరు ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వినియో గదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా తనిఖీలు చేపడతాం.

-రవిబాబు, ఏఎస్‌వో

పాతిక లక్షలకు పైనే కనెక్షన్లు..

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు 32ఉన్నాయి. దీపం, ఉజ్వల, సీఏఎస్ఆర్, డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్‌లకు సంబంధించి జిల్లాలో పాతిక లక్షల నుంచి 30లక్షల లోపు కనెక్షన్లు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే దాదాపు వినియోగదారులంతా అదనంగా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. సిలిండర్ డెలివరి సిబ్బంది ఇచ్చే రశీదులో సంబంధిత చార్జీలు, ఏజెంట్ కమీషన్, గ్యాస్ ధర కలిపి ఉం టాయి. గృహాలకు సంబంధించి ఒక్కో సిలిండర్‌కు రూ.65చమురు సం స్థలు ఏజెన్సీలకు చెల్లిస్తున్నాయి. ఇవి కాకుండా డెలివరీ సమయంలో అదనంగా వసూలు చేస్తుండటంతో వినియోగదారులకు భారంగా మారింది. ఐవీఆర్ఎస్ సర్వేలో ఈ విషయం బహిర్గతమైంది.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో నారాయణ కళాశాల ప్రిన్సిపాల్, ఏజీఎం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో నంద్యాల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఏజీఎం అంజన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఎంపీసీ విభాగంలో గురుచరణ్‌తేజ్, పూజిష, లక్ష్మీప్రసన్న, 470కి 466 మార్కులు సాధించి టౌన్‌టాప్‌గా నిలిచారని తెలిపారు. అలాగే శివప్రియ, తేజేశ్వర్, దివ్యసిరి, నాగతేజ, సాయిహర్షిత, ఈశ్వరవరప్రసాద్, మహ్మద్ అఫ్రిదిఖాన్ 470 మార్కులకు 466 మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్ బైపీసీ విభాగంలో సరియు, నసీఫాలు 440 మార్కులకు 436 మార్కులు సాధించారని, ఫాతిమా అఫ్రీన్ 440కి 432, ఫైజీయా ప్రీతిబాయి, నవనీత్ కళ్యాణ్, 440 మార్కులకు 432 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 95.14 ఉత్తీర్ణతతో టౌన్‌టాప్‌గా, ద్వితీయ సంవత్సరంలో 98.38 శాతంతో జిల్లా టాప్‌గా నిలిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన విద్యార్థులకు, అధ్యాపకులకు, ప్రిన్సిపాల్, ఏజీఎంలకు డిస్ట్రిక్ట్ కోర్‌డీన్ లింగేశ్వరరెడ్డి, డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్ వెంకటేశ్వర్లు అభినందించారు.

కనీస వేతనం అమలు చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

నంద్యాల రూరల్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు పీఎఫ్, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు కావస్తున్నా పంచాయతీ కార్మికుల జీవితాలు బాగుపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికి అమలు చేయడం లేదని ఆరోపించారు. జీవో 132 ప్రకారం గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పీఎఫ్ అమలు చేయడం లేదన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు ఐదు వేలు ఇవ్వాలన్నారు. టెండర్లతో అవసరం లేకుండా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు భాస్కర్, సారయ్య పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం దేవస్థానం తరపున నిర్వహిస్తున్న ధర్మపదంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద గాజులపల్లె కి చెందిన విజయవాడ పివిఎ ప్రసాద్ చే భక్తి సంగీతం కార్యక్రమం నిర్వహించారు. రెండవ కార్యక్రమంలో భాగంగా విజయవాడ విజయవల్లి భరద్వాజ్ చే కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వినాయక వచం, మూషికవాహన, నమో నమో నటరాజ, శివ తాండవం, శివపంచాక్షరీ స్తోత్రం, భ్రమరాంబికా అష్టకం తదితర గీతాలకు సరోజ,యశ్మిత, ప్రణతి, వందన, వర్ష తదితరులు నృత్యప్రదర్శన చేశారు. అనంతరం హరికథ,బుర్రకథ,సంప్రదాయ నృత్యం, వాయుద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

రూ. లక్ష విరాళం

నంద్యాల కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం హైదరాబాద్‌కు చెందిన వెంకట రఘురామ రాయలు దంపతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు గంజి రవి దాతకు రీసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అనంతరం అర్చకులు దాత వెంకట రఘురామ రాయల్ దంపతులను ఆశీర్వదించారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- మసీదుల్లో, ఈద్గాల్లో ప్రార్థనలు
- సమస్త మానవాళి కోసం ముస్లింల దువా

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని ఇమాములు అన్నారు. శనివారం డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ముస్లింలు ఘనంగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు. అన్ని ఈద్గాల్లో ఉదయం 7:30 గంటల నుంచి 9:30 గంటల వరకు ఆయా మసీదుల్లో ఇమాముల ఆధ్వర్యంలో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. సమస్త మానవాళి కోసం ముస్లింలు దువా చేశారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


ఆళ్లగడ్డ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


డోన్ ఈద్గాలో ప్రసంగిస్తున్న మత గురువు


రుద్రవరంలో ప్రార్థనలు చేయిస్తున్న మతపెద్ద


ఉయ్యాలవాడలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కొలిమిగుండ్లలో ప్రవక్త బోధన చేస్తున్న ఖాజీ ఖాదర్‌వలి


నరసాపురంలో సందేశం వింటున్న ముస్లింలు


ప్యాపిలిలో..


చాగలమర్రి ఈద్గాలో పండుగ విశిష్టత గురించి తెలుపుతున్న ప్రభుత్వ ఖాజీ యూనస్


బనగానపల్లె పట్టణంలో..


దొర్నిపాడులో మతపెద్దతో యువకులు


అవుకులో ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు

వైభవంగా వేంకటేశ్వరస్వామి పల్లకి ఉత్సవం


మూడురాళ్లపల్లెలో వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం వేద పండితులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పురవీధుల గుండా పల్లకి ఉత్సవం చేశారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పడకండ్ల గ్రామంలో...

ఆళ్లగడ్డ: మండలంలోని పడకండ్ల గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల వారు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సన్నుతి బాబు, గౌరవ అధ్యక్షుడు చాటకొండు శ్రీనివాసులు, సంజీవ వెంకట కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శులు నరసింహ కుమార్, నిరంజన్, కోశాధికారి బైసాని రవి, ప్రకాష్, వెంకట సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాసాపురం గ్రామంలో..

రుద్రవరం: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, లక్ష్మిగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోపిశర్మ, శివశర్మలు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

● మున్సిపల్ కమిషనర్ కిషోర్

ఆళ్లగడ్డ జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎన్‌ఆర్ చికెన్ సెంటర్ యజమానిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆళ్లగడ్డలోని చికెన్ సెంటర్ నిర్వాహకుడు తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చికెన్ సెంటర్‌లో శాంపిల్స్ కోసం వెళ్లిన సిబ్బందిని, వెటర్నరీ అధికారుల విధులను అడ్డుకొని భయభ్రాతులకు గురి చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన కోళ్లను విక్రయించకపోతే తనిఖీ అధికారులను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రెండు నెలల కిందట ఏఎన్‌ఆర్ చికెన్ సెంటర్‌లో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపితే భయంకరమైన నిజాలు నివేదికలో వచ్చాయన్నారు. ఆ మేరకు నాలుగు చికెన్ సెంటర్లలో తనిఖీలు చేపట్టామన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

మామిడి పండ్ల లారీ బోల్తా


హైవేలో బోల్తా పడిన మామిడి పండ్ల లారీ

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామ సమీపంలోని ఇడమడక చెక్‌పోస్టు హైవే రహదారిలో శనివారం సాయంత్రం మామిడిపండ్ల లారీ బోల్తాపడింది. తిరుపతి నుంచి హర్యానకు వెళ్తుండగా అదుపుతప్పి రహదారిపైనే బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. లారీలో ఉన్న మామిడిపండ్ల బాక్సులు రహదారిపై చెల్లా చెదురుగా పడి వ్యాపారికి నష్టం వాటిల్లింది. రహదారిపై లారీ బోల్తాపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని టోల్‌ప్లాజా సిబ్బంది క్రేన్ సహాయంతో లారీని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో బీసీ ఇందిరమ్మ


స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఈవో

బేతంచెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగా పురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను శనివారం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో రామాంజనేయులు ఆమెను శేషవస్త్రాలతో సన్మానించి స్వామి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు ఉన్నారు.

తెలంగాణ డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు


భట్టిని కలిసి డోన్ నాయకులు

డోన్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను డోన్ కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. పాణ్యం నియోజకవర్గంలోని గ్రీన్‌కో కంపెనీ సందర్శనకు వచ్చిన టీఎస్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్, నాయకులు మద్దిలేటి, జనార్దన్, జీవన్, రాజశేఖర్ తదితరులున్నారు.

ఆహోబిలంలో విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ పూజలు


చీఫ్ ఇంజనీర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలంలో ఏపీ ఎస్పీ డీసీఎల్ తిరుపతి చీఫ్ ఇంజనీర్ ఆదిశేషయ్య శనివారం కుటుంబ సమేతంగా లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి ప్రత్యేక పూజలు చేసి నవ నరసింహస్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య, ఆళ్లగడ్డ విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏడీఈ రమేష్ కుమార్, ఏఈ క్రిష్ణయ్య పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

● పార్కింగ్ స్థలాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల



పార్కింగ్ స్థలాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఫ్లైఓవర్ కింద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏర్పాటు చేసిన పార్కిగ్ స్థలాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఏడు బ్లాకులను పోలీసులు ఆధీనంలోకి తీసుకుని బైకుల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఆయా కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలసల రామకృష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, తదితరులున్నారు.

● **బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత**

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.2 లక్షల చెక్కును బాధితుడు జక్కిరెడ్డి ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రాయలసీమ రేంజ్ డీఐజీ కోయప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, నాయకులు ఉన్నారు.

పెట్టుబడులు తగ్గించుకోండి

కోవెలకుంట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ సాగులో శాస్త్రవేత్తల సలహాలు పాటించి పెట్టుబడులు తగ్గించుకోని అధిక లాభాలు పొందాలని కేవీకే శాస్త్రవేత్త రమణయ్య అన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మండల పరిధిలోని జోలదరాశి, కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లో నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త రమణయ్య, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు పాల్గొని రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో నిరంజన్, డీఆర్సీ నంద్యాల ఏవో ప్రభావతమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బీసీ కోవెలకుంట్లకు రాక

కోవెలకుంట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం కోవెలకుంట్లకు రానున్నట్లు టీడీపీ నాయకుడు గువ్వల సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు వెళ్లే బైపాస్ రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేయనున్నట్లు వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

డోన్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ ఎస్ఐ బిందు మాధవి తనిఖీలు చేశారు. తిరుపతి డీఐజీ, ఎస్ఆర్‌పీ, డీఎస్ఆర్‌పీ అధికారుల ఆదేశాల మేరకు శనివారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో గంజాయి కోసం ప్రత్యేక దాడులు, విస్తృత తనిఖీలు చేపట్టారు. డోన్‌లోనూ రైల్వేస్టేషన్‌లో, ప్లాట్‌ఫారంపై, వెయింటింగ్ హాలులో, పార్సల్ ఆఫీసులో తనిఖీ చేశారు.

రైళ్లను పునరుద్ధరించాలి

డోన్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ నాయకుడు సుంకయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ నాయకులు రాధాకృష్ణ, మోటరాముడు, నారాయణల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్ సాదిక్, ఆర్టు రమణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ, వైసీపీ నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైళ్లు రద్దు కావడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి: సీపీఐ

బేతంచెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని, కార్మికుల సమస్యలు తక్షణమే చర్చించి పరిష్కరించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్. రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల మండలం సిమెంటునగర్‌లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు సీపీఐ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఫ్యాక్టరీలో ఉపాధి లేకపోవడం ద్వారా కుటుంబ సభ్యులు పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. దీంతో వలస వెళ్లి జీవనం సాగించాల్సి వస్తుందన్నారు. రాజకీయ కారణాల చేత ఫ్యాక్టరీని మూసివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయమైన సమస్యను పరిష్కరించకపోతే కార్మికుల కుటుంబాలతో పెద్ద ఎత్తున ఆందోళనలు కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు పెంచి రోడ్డు నిర్మాణం

- మంత్రి ఆదేశం.. కదలిన యంత్రాంగం
- ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

కొలిమిగుండ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే అధికారులు రోడ్డు ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టడంతో ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైంది. మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో స్టేట్ బ్యాంకు, వైసీపీ కార్యాలయం ఎదురుగా ఎన్‌హెచ్ 544డి రహదారిపై వర్షం కురిస్తే చాలు వరద నీరు కుంటలా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఎన్‌హెచ్ 544డి ప్రధాన రహదారి ఈప్రాంతంలో తగ్గ ఉండటం, డ్రైనేజీ సరిగ్గాలేని కారణంగా వర్షం పడితే చాలు చెరువును తలపించేలా మారుతోంది. ఇటీవల 20రోజుల క్రితం కురిసిన వర్షానికి కూడా పెద్ద ఎత్తున నీరు నిలిచి కుంటను తలిపించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో కొద్ది రోజుల క్రితం కొలిమిగుండ్లలో పర్యటించిన మంత్రి బీసీ ఈరహదారిని పరిశీలించారు. రోడ్డు ఎత్తులేపి నీరు నిలిచిపోకుండా త్వరితగతిన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో నేషనల్ హైవే అదికారులు 10రోజుల్లోనే ఎన్‌హెచ్ 544డి రహదారి ఎత్తు పెంచి రోడ్డు వేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యకు మంత్రి బీసీ ఆదేశాలతో ఉపశమనం లభించినట్లు అయిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కుంటను తలపించేలా నిలిచిన వర్షపు నీరు(ఫైల్)



రహదారిలో గుంతను పూడ్చి రోడ్డు వేసిన దృశ్యం

టీజీపీ డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.1.75 కోట్లు

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో టీజీపీ డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులకు రూ.1.75 కోట్లు మంజూరైనట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 21, 22 బ్లాక్ చానల్‌లో డిస్ట్రిబ్యూటరీ మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎనిమిది పనులు చేసేందుకు ఆమోదం వచ్చిందన్నారు. సాగునీటి సంఘాల ద్వారా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో వచ్చే నీలినాలుక వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్సలు చేయించాలని అన్నారు. తొలకరి వర్షాలు కురవడంతో పచ్చిగడ్డితిన్న మేకలు, గొర్రెలు పచ్చిగడ్డి తిని పారుడువ్యాధి సోకే ప్రమాదం ఉందని పెంపకందారులు వ్యాధి అధికం కాకముందే చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరాముడి మృతి బాధాకరం

ప్యాపిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరాముడి మృతి బాధకరమని ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కలచట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎంపీ వెంకటరాముడు(70) మృత దేహానికి నివాళి అర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా ఉన్న వెంకటరాముడు మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనం తరం కుటుంబ సభ్యుల కలసి ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. నాయకులు కలచట్ల ప్రసాద్, మద్దిలేటి, బాలరంగన్న తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలు

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. భూమానగర్, గంగమ్మవీధి, గుంతపాలెం వీధులలో జనాభా అధికంగా ఉండటంతో కొత్త కేంద్రాల ఏర్పాటుకు అనుమతుల కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు వస్తే కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. కొత్త కేంద్రాలకు అంగన్‌వాడీ వర్కర్లను, ఆయాలను నియమిస్తామని అన్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు

చాగలమర్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె, శెట్టివీడు గ్రామాల రహదారుల్లోగల అభయాంజనేయ స్వామికి శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా భజన కార్యక్రమాలు, హనుమాన్ వ్రతాన్ని చేశారు. చాగలమర్రి గాంధీబజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బెలుం గుహల్లో పర్యాటకుల సందడి

కొలిమిగుండ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. బక్రీద్ పర్వదినం కావడంతో పర్యాటకులు బెలుం గుహలకు తరలి వచ్చారు. దీంతో బెలుం గుహలు సందర్శకులతో కళకళలాడాయి. గుహల్లోని ముఖ్య ప్రదేశాలైన పాతాళగంగ, వెయ్యిపడగలు, ఊడలమర్రి, సన్యాసి మఠం, కోటి లింగాలు, గుహల ఆవరణం లోని ఎత్తైన బుద్ధ విగ్రహం తదితర ప్రాంతాలను సందర్శించి అబ్బురపడ్డారు.